## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చందానగర్: మాతృశ్రీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

- మైత్రీనగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 12.00 గంటల నుంచి సాయంత్రం 5.00 వరకు మాతృశ్రీనగర్ కొంతభాగం, విజయ సూపర్ మార్కెట్, డీఏవీ స్కూల్, మాధవనగర్ ఏరియాలలో విద్యుత్ ఉండదన్నారు.
- కల్యాణ గార్డెన్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి 11.30 వరకు మాధవనగర్ ఏరియాలో ..
- విశ్వంభర ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 12.00 గంటల నుంచి 12.30 వరకు విశ్వంభర, శిల్పా ఎవెన్యూ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

**గచ్చిబౌలిలో..**

గచ్చిబౌలి: ఇజ్జత్‌నగర్ విలేజ్, శిల్పాహిల్స్ రోడ్డు నెంబర్ 1,2,3, సన్‌షైన్ అపార్ట్‌మెంట్స్, అపర్ణ విల్లాస్, న్యాక్, వసంతసిటీ, సైబర్ విలేజ్, సైబర్ వ్యాలీ ,సీసీఆర్‌టీ తదితర ప్రాంతాలలో శనివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ ఉండదని కొండాపూర్ ఏఈ ఎస్.రంగారెడ్డి తెలిపారు.

**మియాపూర్‌లో..**

మియాపూర్: మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలో ..శనివారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు మదీనాగూడ, కృషినగర్, ఎంఏనగర్, స్టాలిన్‌నగర్, వీడియా కాలనీ, మియాపూర్ మెయిన్ రోడ్డు, ఎఫ్‌సీఐ కాలనీ, లేక్‌వ్యూ అపార్ట్‌మెంట్, సత్య కళ్యాణ్ అపార్ట్‌మెంట్స్, ఎస్ఎంఆర్ మెట్రో పాలిస్, ఎస్ఆర్ ఎస్టేట్ అపార్ట్‌మెంట్, వడ్డెరబస్తీ, విజేత సూపర్ మార్కెట్ లైన్, టాకీటౌన్ మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాస్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

## నేడు హెచ్‌సీయూలో స్వయం వర్క్‌షాప్-2025

రాయదుర్గం: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ రూపొందించిన 'స్వయం వర్క్‌షాప్-2025' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. హెచ్‌సీయూ నిర్వహించే ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, అండమాన్ అండ్ నికోబార్ ప్రాంతాలలోని విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ కళాశాలలో స్వయం కోర్సు అమలుపై అవగాహన కల్పిస్తారు. 'స్వయం' అనేది భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వశాఖ ప్రారంభించిన కార్యక్రమం. అత్యంత వెనుకబడిన వారితో సహా అందరికీ అత్యుత్తమ బోధనా అభ్యాస వనరులను తీసుకెళ్లడం లక్ష్యం.


## విద్యార్థుల ఫీల్డ్ ట్రిప్



పొలంలో నాటు వేస్తున్న మిలీనియం స్కూల్ విద్యార్థులు

గచ్చిబౌలి: విద్యార్థులు వరి చేనులో ఎంజాయ్ చేశారు. మసీద్‌బండలోని మిలీనియం ప్రీ స్కూల్ చిన్నారులకు వ్యవసాయం గురించి తెలియజేసేందుకు ఫీల్డ్ ట్రిప్‌ను నిర్వహించింది. రాజేంద్రనగర్ మండలంలోని హిమాయత్‌సాగర్‌లోని పొలాలకు తీసుకెళ్లారు. నాట్లు ఎలా వేయాలో చూపించారు. పంపుసెట్ వద్ద తెగ ఎంజాయ్ చేశారు. అరటి, సపోట చెట్లను చూపించారు. అనంతరం సహపక్తి భోజనాలు చేశారు.

## పదవీ విరమణ సత్కారం



అన్సారీని సన్మానించిన అధికారులు

గచ్చిబౌలి: ప్రతి ఉద్యోగికి పదవీవిరమణ తప్పదని కొండాపూర్ 8వ బెటాలియన్ ఇన్‌చార్జీ కమాండెంట్ బీవీరెడ్డి అన్నారు. కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో పదవీ విరమణ చేసిన ఎం.డి. జహూర్‌అన్సారీని శుక్రవారం సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్నప్పుడు చేసిన సేవలు గుర్తుండి పోతాయన్నారు. కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్లు ఎస్ రాంబాబు, ఎం రహమాన్, పార్థసారథి రెడ్డి, బి సీతారామ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ చేసిన నెలలోనే పెన్షన్ పత్రాలు

పటాన్‌చెరు టౌన్: పదవీవిరమణ పొందిన నెలలోనే పెన్షన్ ప్రయోజనాలను మంజూరు చేసే ప్రక్రియను క్రమబద్ధీకరించడం, పదవీ విరమణ అనంతరం సాఫీగా సాగేలా చేయడమే లక్ష్యం అని ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్-2 శ్రీదేవి అన్నారు. శుక్రవారం పదవీ విరమణ పొందిన చందాదారులకు పెన్షన్ చెల్లింపు ఆర్డర్ కాపీలను అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... జనవరిలో పదవీ విరమణ పొందిన 42 మందికి పీపీఓలను జారీ చేశామన్నారు.

# 13 కిలోమీటర్లు.. 10 మెట్రో స్టేషన్లు..

### త్వరలోనే మియాపూర్- పటాన్‌చెరు వరకు మెట్రో రైల్ నిర్మాణ పనులు

- 50 కిలోమీటర్ల ప్రయాణం.. 90 నిమిషాలు
- లింగంపల్లి, బీహెచ్‌ఈఎల్, ఆర్‌సీపురం, పటాన్‌చెరు ప్రజలకు తీరనున్న ట్రాఫిక్ కష్టాలు
- చందానగర్ వద్ద డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్



డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నమూనా

చందానగర్: మియాపూర్ టు పటాన్‌చెరు మెట్రోరైలు అందుబాటులోకి రానుంది. ఇందుకు సంబంధించి త్వరలో నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. రెండవ విడతలో మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు 13 కిలోమీటర్ల మెట్రో రైల్ నిర్మాణానికి మెట్రో రైలు నిర్మాణ సంస్థ, ఎల్ అండ్ టీ ప్రతినిధులు డీపీఆర్‌తోపాటు మెట్రో స్టేషన్ల వివరాలు విడుదల చేశారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా మెట్రో రైల్ పొడిగింపునకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది.

- మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు 10 మెట్రో స్టేషన్‌లు ఇవే....
- మియాపూర్ క్రాస్ రోడ్డు, ఆల్విన్ కాలనీ చౌరస్తా, మదీనాగూడ, చందానగర్, బీహెచ్‌ఈఎల్, జ్యోతినగర్, బీరంగూడ, ఆర్‌సీపురం, ఇక్రిశాట్, పటాన్‌చెరు
- పటాన్‌చెరు నుంచి హయత్‌నగర్ వరకు 50 కిలోమీటర్ల ప్రయాణం ఉండనుంది. మెట్రోలో కేవలం 90 నిమిషాల్లో వెళ్లొచ్చు.
- పటాన్‌చెరు, బీహెచ్‌ఈఎల్, చందానగర్, లింగంపల్లి ప్రాంతవాసులు దూర ప్రాంతాలకు వెళ్లాలంటే మెట్రో రైలు ఎంతో ఉపయోగకరం
- ఎంజీబీఎస్, జేబీఎస్ బస్టాండ్‌లకు, సికింద్రాబాద్, నాంపల్లి రైల్వే స్టేషన్లకు మెట్రో రైల్‌తో ప్రయాణం ఎంతో సులభతరంగా ఉంటుంది.
- ట్రాఫిక్ జామ్‌లతో ఇబ్బందులు పడకుండా సులువుగా గమ్యాలను చేరుకోవచ్చు.
- ముంబై జాతీయ రహదారిపై రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలకు మెట్రోతో చెక్ పడనుంది



గంగారం జాతీయ రహదారిపై డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మాణం జరిగేది ఈ ప్రాంతంలోనే..

- గంగారం వద్ద ప్రధాన రహదారిపై దేవాలయాలు, మతపరమైన కట్టడం ఉండడంతో సుమారు 1.2 కిలోమీటర్లు డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మించనున్నారు.
- ఇప్పటికే చందానగర్ వద్ద జాతీయ రహదారి సంస్థ 1.5 కిలోమీటర్ల ఫ్లైఓవర్ నిర్మిస్తున్నారు.
- ట్రాఫిక్ జామ్ కాకుండా చందానగర్ ప్రధాన రహదారిలో డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్, మరో ఫ్లైఓవర్‌తో రూపురేఖలు మారనున్నాయి.
- చందానగర్‌లోని బీఆర్ అంబేడ్కర్ కల్యాణ మండప స్థలాన్ని మెట్రో రైల్‌కు అప్పగించనున్నారు.
- మియాపూర్ నుంచి లింగంపల్లి వరకు మెట్రో నిర్మాణం పూర్తయితే జాతీయ రహదారి కూడా విశాలంగా మారి ట్రాఫిక్ సమస్య తీరుతుంది.

### దూరప్రాంతాలకు వెళ్లేవారికి ఎంతో ఉపయోగం



చందానగర్, బీహెచ్‌ఈఎల్, పటాన్‌చెరు ప్రాంతాల వాసులు ఎంజీబీఎస్, జేబీఎస్ బస్టాండ్‌లకు, సికింద్రాబాద్, నాంపల్లి రైల్వే స్టేషన్లకు బస్‌లో వెళ్లాలంటే గంటన్నర సమయం పడుతుంది. కానీ మెట్రో రైల్‌లో అతి తక్కువ సమయంలో చేరుకోవచ్చు. దూర ప్రయాణం చేసే వారికి ఎంతో ఉపయోగకరం.

– నరాల మహేశ్వర్‌రెడ్డి, చందానగర్

## నాలాల విస్తరణతో ముంపు సమస్యకు చెక్



బాక్స్‌టైప్ డ్రైన్ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు, అధికారులు

**ఎమ్మెల్యే గాంధీ**

శేరిలింగంపల్లి: వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కార దిశగా చర్యలు ప్రారంభించినట్లు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ వెల్లడించారు. రూ.28.45 కోట్లతో నల్లగండ్ల చెరువు అలుగు నుంచి బీహెచ్‌ఈఎల్ కూడలి గ్యాస్ గోడౌన్ నాలా వరకు ఆర్‌సీసీ బాక్స్‌డ్రైన్ నిర్మాణ పనులకు తారానగర్ సాయిబాబా ఆలయం వద్ద కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, గంగాధర్‌రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్‌లతో కలసి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఎస్ఎన్‌డీపీ ఫేజ్-2 కింద శేరిలింగంపల్లిలో రూ.79.58 కోట్ల అంచనా వ్యయంతో నాలాల విస్తరణ పనులు, ఆర్‌సీసీ బాక్స్ డ్రైన్ పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎన్‌డీపీ అధికారులు ఈఈ సత్యనారాయణ, డీఈ రాజు, ఏఈ మహేందర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు ఈఈ దుర్గాప్రసాద్,డీఈ ఆనంద్, ఏఈ భాస్కర్, నాయకులు రాజు యాదవ్, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, రాంచందర్, రవీందర్ గౌడ్, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

**గుడిసెలు తొలగించాలని పీఏసీ ఛైర్మన్‌ను కోరిన మహిళలు..**

శేరిలింగంపల్లి హుడా ట్రేడ్ సెంటర్ కాలనీలో అక్రమంగా ఏర్పాటు చేసుకున్న గుడిసెలను తొలగించాలని ఎమ్మెల్యే గాంధీని మహిళలు, కాలనీవాసులు కోరారు. కాలనీలోని ఖాళీ ప్లాట్లు, రోడ్లపై గుడిసెలు వేసుకొని తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి తాగుతూ రోడ్లపై ఉండటంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, అపార్టుమెంట్ల బాల్కనీల్లోకి కూడ రాలేకపోతున్నామని చెప్పారు.

**ఇల్లు ఇప్పించండి సారూ..**

తమకు డబుల్ ఇళ్లు ఇప్పించాలని ఎమ్మెల్యే గాంధీని గుడిసెవాసులు కోరారు. ఎన్నో ఏళ్ళుగా ఇక్కడే నివాసం ఉంటున్నామని మొరపెట్టుకున్నారు. ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ రేషన్ కార్డు, ఆధార్ కార్డు తదితర వివరాలతో కార్పొరేటర్ నాగేందర్ యాదవ్‌ను కలవాలని సూచించారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు.

## 'మనూ'లో మూడు రోజుల వర్క్‌షాప్

**కెమెరా, లైటింగ్‌పై శిక్షణ**

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్ (ఐఎంసీ) ఆధ్వర్యంలో కెమెరా, లైటింగ్ టెక్నిక్‌లపై మూడు రోజుల వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేసినట్లు ఐఎంసీ డైరెక్టర్ రిజ్వాన్ అహ్మద్ శుక్రవారం తెలిపారు. ఫిబ్రవరి 4 నుంచి 6వ తేదీ వరకు ఐఎంసీలో 'విజనల్ టు స్క్రీన్ ఏ డిజిటల్ వే' అంశంపై ఈ వర్క్‌షాప్ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు 3వ తేదీ మధ్యాహ్నం 2 గంటల లోపు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పాల్గొనే వారు రూ.1500 రుసుము చెల్లించి ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ చలనచిత్ర నిర్మాత పద్మశ్రీ ఏ.కె.బీర్, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ రామ్ సహాయ్ పాల్గొంటారని ఆయన వివరించారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 8587900804లో సంప్రదించాలని ఆయన సూచించారు.

## పనుల్లో నాణ్యత పాటించాలి

మియాపూర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ స్వర్ణపురి ప్రధాన రహదారి కమాన్ నుండి అబ్దుల్ కలాం విగ్రహం వరకు రూ.75లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. జీహెచ్‌ఎంసీ అధికారులు ఏఈ సంతోష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నవీన్, నాయకులు శ్రీనివాస్ యాదవ్, హెచ్‌ఎంటీ కాలనీ అధ్యక్షులు ,అసోసియేషన్ సభ్యులున్నారు.

## థీమ్ పార్కు తరహాలో అభివృద్ధి చేస్తాం

**ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి**



పార్కు స్థలంను సందర్శించి కమ్యూనిటీ ప్రతినిధులతో మాట్లాడుతున్న డీసీ మోహన్‌రెడ్డి తదితరులు

చందానగర్: పార్కు స్థలాలను అభివృద్ధి చేస్తామని చందానగర్ సర్కిల్ 21 ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల అపర్ణ కమ్యూనిటీలో ఖాళీగా ఉన్న పార్కు స్థలాన్ని అభివృద్ధి చేయాలని విన్నవించిన నేపథ్యంలో శుక్రవారం జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్, వివిధ విభాగాల అధికారులతో ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీసీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే విధంగా, థీమ్ పార్కు తరహాలో అభివృద్ధి చేసే విధంగా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో అపర్ణ కమ్యూనిటీ ఫెడరేషన్ అధ్యక్షురాలు రాణిరెడ్డి, ఈఈ కెవిఎస్ఎన్ రాజు, డీఈ దుర్గా ప్రసాద్, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ రవి, యూబీడీ అధికారి సమీదర, ప్రతినిధులు విక్రమ్, రమేష్, డాక్టర్ రాజారాం, డాక్టర్ నారాయణరెడ్డి, పద్మ, రాగిణి పాల్గొన్నారు.

## అలరించిన సంగీత, నృత్య ప్రదర్శనలు





మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న త్యాగరాజ ఆరాధన సంగీతోత్సవాల్లో భాగంగా శుక్రవారం గురుస్వప్న కృష్ణమోహన్ శిష్యబృందం చే నౌకాచరిత్రం కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. విద్వాన్ శాస్త్రీ త్యాగరాజ కృతులు, విద్వాన్ డివికె వాసుదేవన్, విద్వాన్ దోణేంద్ర ఫణి కుమార్ వయోలిన్, వేణునాదంతో అలరించారు. కార్యక్రమంలో చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు సిఎస్ రంగరాజన్ పాలొన్నారు. సంస్కృతి ఫౌండేషన్ నిర్వాహకులను, సిబ్బందిని అభినందించారు.

## తెలంగాణ జీసీసీల కోసం ప్రపంచస్థాయి హబ్ ఏర్పాటు

**రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు**



మంత్రి శ్రీధర్‌బాబును సన్మానించిన నిర్వాహకులు

రాయదుర్గం: తెలంగాణకు చెందిన గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు(జీసీసీ)ల కోసం ప్రపంచ స్థాయి హబ్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఐటీ, పరిశ్రమలు, శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని ఐటీసీ కోహినూర్‌లో ది ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీసీసీ, సీఈఓల సమ్మిట్‌ను శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రగతిశీల విధానాలు, అత్యాధునిక స్థాయి మౌలిక సదుపాయాలు, అభివృద్ధి చెందుతున్న ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థ తెలంగాణ రాష్ట్రంలో ఉన్నాయని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వ చొరవతో శిక్షణ పొందిన మానవశక్తి లభ్యతపై ప్రభుత్వం పూర్తి స్థాయి దృష్టి సారించిందన్నారు. యూఎస్ హైదరాబాద్ కాన్సుల్ జనరల్ జెన్నీఫర్ లారెన్స్ మాట్లాడుతూ అమెరికాకు హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రంతో ఎంతో అనుబంధం ఉందన్నారు. కార్యక్రమంలో ఐఎస్ఎఫ్ సహ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ శివమహేష్, ఐఎస్ఎఫ్ కన్వీనర్, ఛైర్మన్ జేఏచౌదరి, ఇతర సహ వ్యవస్థాపకులు ఎం సత్యేంద్ర కుమార్ అట్లూరి, శేషేంద్ర, ప్రకాశ్‌బండ్ల, మధుసూదన్‌సాయి ,లాయిడ్స్ టెక్నాలజీ సెంటర్ సీఈఓ శిరీష ఓరుగంటి, జీసీసీ ప్రతినిధులు, పలువురు సీఈఓలు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

**ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ**

గచ్చిబౌలి: ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సూచించారు. కొండాపూర్ ఆర్టీఏ కార్యాలయంలో జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని, కుటుంబాలు రోడ్డున పడతాయని అన్నారు. అతి వేగం, రాంగ్‌రూట్, సిగ్నల్ జంప్‌లు ప్రమాదానికి కారణమయ్యే అవకాశాలని ఆయన తెలిపారు. కారు నడిపే వారు సీట్ బెల్టు ధరించాలని సూచించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ సదానంద్, ఎంవీఐలు కిరణ్‌కుమార్, నవీన్, ఏఎంవీఐలు మనోజ్, శ్రీముఖి, స్వాతి ఉపాసిని తదితరులు పాల్గొన్నారు.

**మియాపూర్ డిపోలో..**

మియాపూర్: రోడ్డు భద్రత అందరి బాధ్యత అని మియాపూర్ ట్రాఫిక్ ఎస్ఐ మక్బుల్ పాషా అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని మియాపూర్ ఆర్టీసీ-2 డిపోలో రోడ్డు నిబంధనలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. బస్సులను బస్టాప్‌లోనే నిలపాలని, ఎక్కడపడితే అక్కడ నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని సూచించారు. అనంతరం డిపో పరిధిలోని ఉత్తమ డ్రైవర్లను సన్మానించారు. కార్యక్రమంలో డిపో-2 డీఎం వెంకటేశం, సూపరింటెండెంట్ పద్మ శేఖర్, అసిస్టెంట్ మేనేజర్ పండరి, ప్రశాంత్, సెక్యూరిటీ ఇంచార్జీ జంగారెడ్డి పాల్గొన్నారు.

## చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపాలి



జీహెచ్‌ఎంసీ సర్కిల్ అధికారులతో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, చిరువ్యాపారులు

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపాలని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నానక్‌రాంగూడ చిరు వ్యాపారులందరూ శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో అధికారులను కలిసి మాట్లాడారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునే వారికి జీవన భృతి లేకుండా చేయడం తగదన్నారు. అనంతరం శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ముకుందరెడ్డి, టౌన్‌ప్లానింగ్ అధికారులతో కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి చిరువ్యాపారులు, సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారి సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ముకుందరెడ్డి స్పందిస్తూ చిరువ్యాపారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ జీషాన్, నాయకులు శివసింగ్, తిరుపతి, వరలక్ష్మీ, ధీరజ్, సుమన్ శేఖర్, కిషన్, గోపాల్, శంకర్, శ్రీను, స్థానికులు పాల్గొన్నారు.

## 'ఆప్టికా ఫెలో'గా ప్రొ.వేణుగోపాలరావు



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సోమ వేణుగోపాలరావుకు అరుదైన అవకాశం లభించింది. అమెరికాలోని 'ఆప్టికల్ సొసైటీ ఆఫ్ అమెరికా'(ఆప్టికా) ఫెలో-2025 మెంబర్‌గా ఎన్నికయ్యారు. ఆయన హెచ్‌సీయూలోని విశిష్ట భౌతిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ వేణుగోపాలరావు అల్ట్రాఫాస్ట్ స్పెక్ట్రోస్కోప, నాన్ లీనియర్ ఆప్టిక్స్(ఎన్ఎల్ఓ) అధ్యయనాలు, పేలుడు పదార్థాలను గుర్తించే పద్ధతులకు మూడు దశాబ్దాలకు పైగా అకడమిక్, పరిశోధనా అనుభవంతో 15 రీసెర్చ్‌లను పర్యవేక్షించారు.పేలుడు పదార్థాలను గుర్తించే పద్ధతులపై ఆయన చేసిన పరిశోధనలకు గుర్తింపు లభించింది. ఆయనను హెచ్‌సీయూ ఫ్యాకల్టీ, ప్రొఫెసర్లు అభినందించారు.



## ముగిసిన సదస్సు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో మూడవ 'హెచ్‌ఈఎల్‌ఈ' సదస్సు శుక్రవారం ముగిసింది. 'మనూ' ఇంగ్లిష్ విభాగం, హిస్టరీ ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ఎడ్యుకేషన్ (హెచ్‌ఈఎల్‌ఈ) ఆధ్వర్యంలో 'భారతదేశంలో ఆంగ్ల భాష విద్య, చరిత్ర: రస్పర చర్యలు, అమలు' అనే అంశంపై ఈ సదస్సును నిర్వహించారు.దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 60 మందికి పైగా విద్యావేత్తలు, పరిశోధకులు పాల్గొన్నారు. ముగింపు సమావేశంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన 'ఇఫ్లూ' ప్రొఫెసర్ వి ప్రకాశం మాట్లాడుతూ భారత దేశం అనేది బహుభాషా సమ్మేళనమని, ఇక్కడ అన్ని భాషలకు సమాన ప్రాధాన్యత ఉంటుందన్నారు. అనంతరం హెచ్‌ఈఎల్‌ఈ వెబ్‌సైట్‌ను ప్రొఫెసర్లు అతాను భట్టాచార్య, గుల్ఫిషన్ హబీబ్, షుగుఫ్తాషాహిన్ ఆవిష్కరించారు. హెచ్‌ఈఎల్‌ఈ వెబ్‌సైట్ రూపకర్తకు అవార్డులు అందించారు. ఈ సదస్సులో దేశవ్యాప్తంగా వివిధ విశ్వ విద్యాలయాల నుంచి 42 పరిశోధనా పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు సల్మా ఫారూఖీ, ఇంతియాజ్ హుస్సేన్, పరిమళరావు, జినియాఅల్‌బహ, సమీనా తబస్సుమ్ ప్రసంగించారు.

## 13 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.... గురువారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 13 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహన దారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 8 మందికి రూ.2 వేలు జరిమానా, ముగ్గురికి రూ. 1500, మరో ఇద్దరికి రూ. 1000 జరిమానా విధించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

## దేశంలో మార్పు తెచ్చేందుకు యువత ప్రయత్నించాలి

**రిటైర్డ్ డీజీపీ, బహుజన సమాజ్ పార్టీ ఆంధ్రప్రదేశ్ కోఆర్డినేటర్ డాక్టర్ పూర్ణచంద్రరావు**



మాట్లాడుతున్న రిటైర్డ్ డీజీపీ డాక్టర్ పూర్ణచంద్రరావు

చందానగర్: భారతదేశంలో పది శాతం మంది వ్యక్తుల చేతిలోనే అధికారం కొనసాగుతోందని రిటైర్డ్ డీజీపీ, బహుజన సమాజ్‌పార్టీ ఆంధ్రప్రదేశ్ కోఆర్డినేటర్ డాక్టర్ పూర్ణచంద్రరావు అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలో శుక్రవారం సాయంత్రం ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్, యూత్ ఫర్ ఇన్‌క్లూజివ్ అండ్ సస్టేనబుల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ' సివిల్ సర్వీసెస్ శిక్షణ, సంసిద్ధతపై' అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ దేశంలో మార్పు తెచ్చేందుకు సివిల్ సర్వీసెస్ సాధించేలా నేటి యువత కష్టపడాలన్నారు. సివిల్ సర్వీసెస్‌కు ఆరు అవకాశాలు ఉంటాయని, ప్రణాళికపరంగా చదువుతూ 75 ప్రశ్నలను గుర్తించి వాటిని చదవాలని, ఇతర అంశాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఇండియన్ డిఫెన్స్ అడల్ట్ సర్వీసెస్ మాజీ డిప్యూటీ డైరెక్టర్, మోటివేషనల్ స్పీకర్ ఎం బాలలత సివిల్ సర్వీసెస్‌ల ఎలాంటి అవకాశాలు ఉంటాయి.. ఎలా చదవాలనే అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఏఐఓబీసీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, వైఐఎస్ఎస్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రబల తీర్థం వేడుకలు

శేరిలింగంపల్లి: నల్లగండ్లలోని అపర్ణ సరోవర్‌లో శుక్రవారం ప్రబల తీర్థం వేడుకలు ప్రారంభమయ్యాయి. మహిళలు కట్టెల పొయ్యిపై పొంగలి చేసి నైవేద్యం సమర్పించారు. వేడుకల్లో భాగంగా పల్లె ఆటలు ఆడారు. వివిధ రకాల వంటలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చందన మాట్లాడుతూ 2016 నుంచి ప్రబల తీర్థం వేడుకలను అపర్ణ సరోవర్‌లో నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈశ్వరుని ఆరాధనలో సరోవర్ వాసులు భక్తిశ్రద్ధలతో పాల్గొంటున్నారని తెలిపారు.



పొంగలి వండుతున్న మహిళలు



పల్లె ఆటలు ఆడుతున్న దృశ్యం